కల్లాల్లో కన్నీరు

- వరుస తుఫాన్‌లు, వర్షాలకు నీట మునిగిన పంటలు
- మరో వైపు దళారుల దెబ్బ
- వరి కొనుగోలు చేయని కేంద్రాలు
- తుఫాన్లకు తడిసి మొలకలు వచ్చిన కల్లాల మీద వరి
- మెట్ట పంటల రైతులు విలవిల
- మిర్చి, కందికి తెగుళ్లు
- గతంలో రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ
- నేడు కూటమి ప్రభుత్వంలో కనిపించని సాయం



కల్లంలో వరిని చూసి దిగాలుగా ఉన్న రైతు

దర్శి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఇటీవల వచ్చిన వరుస వర్షాల ధాటికి వరి, సొద్దలు, గుమ్మడి, పొగాకు, మొక్క జొన్న, కంది, మిరప పంటలు పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. అయినా కూటమి ప్రభుత్వం మాత్రం నష్ట పరిహారం విషయంలో చిన్న చూపు చూస్తోంది. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్రాఫ్ ఇన్సూరెన్స్, రైతు భరోసా వంటి పథకాలతో అండగా నిలిచారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పి రైతులను ఈ ప్రభుత్వం పూర్తిగా మోసం చేసింది. ఏ గ్రేడ్ తేమ శాతం ఉంటే రూ.1740, బీగ్రేడ్ తేమ శాతం ఉంటే రూ.1725 లెక్కన కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే తేమశాతం సాకు చూపించి ఎక్కడా కొనుగోలు చేయడం లేదని రైతులు, వామపక్షనాయకులు విమర్శిస్తున్నారు. దీంతో దలారులను ఆశ్రయించి రూ.1400కే తెగ నమ్ముకుంటున్నారు.

పైసా అందించని ప్రభుత్వం

రెండోసారి వచ్చిన తుఫాను ప్రభావంతో రైతుకు దెబ్బ మీద దెబ్బ పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంటలు మళ్ళీ నీటమునిగాయి. రైతులకు నష్ట పరిహారం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ రూపాయి విదిల్చలేదు. గత ప్రభుత్వం హయాంలో తేమశాతం తక్కువ ఉన్నా, వర్షాలకు తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

మిర్చి రైతు దిగాలు

ఇటీవల వర్షాలకు కల్లాల మీద మిరప పూర్తిగా తడిచి పోయింది. మిరప తొలి కోతలోనే రైతులకు కోలుకోలేని ఎదురు దెబ్బ తగిలింది. ఎకరాకు రూ.2లక్షలు వరకు పెట్టుబడులు పెట్టిన మిర్చి రైతులకు కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఓ వైపు తెగుళ్ల తో విలవిల్లాడుతుంటే మరో వైపు అకస్మాత్తుగా వస్తున్న తుఫాన్ దెబ్బ రైతులను కోలుకోలేకుండా చేసింది. కల్లాల మీద ఉన్న మిరప కాయలు అకాల వర్షానికి తడిచి నాణ్యత లేకుండా నల్లగా మారి పోతున్నాయి. ఆరబోసిన ఎండు మిరప తుఫాను, తెగుళ్లకు నాణ్యత లేకుండా పోతున్నాయి. వర్షాలకు కంది పంట పూత రాలిపోయింది. పొగాకు పంటకు వర్షానికి ఆకు పై జిగులు కారిపోయి బరువు తగ్గుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గతంలో ఇస్తామన్న నష్టపరిహారం ఎక్కడ?

జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, జిల్లా అధికారులు నష్టపోయిన పంటలు పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని హామీలు గుప్పించారు. కానీ ఇస్తారా లేదా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల కురిసిన తుఫానుకు ముండ్లమూరు, దర్శితో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. అయినా అటువైపు కూటమి నాయకులు గాని ప్రజా ప్రతినిధులు గానీ అధికారులు గానీ కన్నెత్తి కూడా చూడక పోవడం దారుణంగా ఉందని రైతులు విమర్శిస్తున్నారు.





ముండ్లమూరు: పసుపుగల్లులో కంకి దశలో వర్షానికి వరిలో వచ్చిన మొలకలు మిరప కల్లంలో తుఫానుకు తడిసిన మిరప పంట

ప్రభుత్వం ఆదుకోవాలి



వరి కోసి కుప్ప వేయగానే తుఫాను ధాటికి పూర్తిగా తడిచి పోయింది. ఆరుగాలం కష్ట పడి పండించిన పంట పూర్తిగా నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం మాలాంటి రైతులను ఆదుకోవాలి.

– సన్నెబోయిన సుబ్బారావు, పోలవరం గ్రామం, ముండ్లమూరు మండలం

రూ.8లక్షలు పెట్టుబడి పెట్టా



ఐదెకరాల వరి, నాలుగు ఎకరాలు మిరప పంట వేశాను. వరి పంటకు రూ.2 లక్షలు పైగా పెట్టు బడి పెట్టాను. మిరపకు ఇప్పటి వరకు రూ.8లక్షలు పెట్టుబడి పెట్టాను. తుఫాను వచ్చి తీవ్రంగా నష్ట పోయా.

– గజ్జల నాగేశ్వరరెడ్డి, పోలవరం

15 ఎకరాల మిరప వేశా



కల్లంలో మిరప తడిచి పోయింది. మిరపకు నల్లముచ్చ, వైరస్‌లు వచ్చాయి. వర్షాలకు ఎన్ని మందులు కొడుతున్న తగ్గడం లేదు. కోసిన మిరప నష్ట పోయాం. గత ప్రభుత్వంలో నష్ట పోయిన రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులను పట్టించుకోవడం లేదు.

– ముతికేపల్లి గురవారెడ్డి

పైసా ఇవ్వలేదు



ఐదు ఎకరాలు మిరప తుఫాను కారణంగా పూర్తిగా దెబ్బతింది. గత ప్రభుత్వంలో నష్ట పరిహారం అందింది. నష్టాలతో రైతులు అల్లాడుతున్న కూటమి ప్రభుత్వం కనికరించడం లేదు. నష్ట పోయిన రైతులకు ఇప్పటి వరకు పైసా విదిలించింది లేదు.

– మిట్టా వెంకటసుబ్బారెడ్డి, రైతు

క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ రేపు

పుల్లలచెరువు: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఈ నెల 31న పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో వసంతరావునాయక్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలపై 31వ తేదీన పంపిణీ చేస్తామని.. అందుకు సచివాలయ ఉద్యోగులు నగదు పంపిణీకి సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బాప్టిస్ట్ చర్చిలో నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘు పెద్దలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చిలో సంఘు కాపరులు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం సంఘుకాపరి ముండ్ల కృపాకర్ ఆధ్వర్యంలో సంఘు సెక్రటరీ డోలు దేవదానం, సంఘు పెద్దలు ఎలకపాటి పెద్దలక్ష్మయ్య, కటికల వెంకటయ్య, కటికల రత్నాకర్, కటికల యేసు రత్నంలు నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్‌ఐ చొరవతో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



పుల్లలచెరువు–వైపాలెం మధ్య ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పుల్లలచెరువు ఎస్‌ఐ సంపత్‌కుమార్ చొరవతో చర్యలు తీసుకున్నారు. మండలంలోని పలు గ్రామాల మూల మలుపుల్లో ప్రమాదాలు జరిగే ప్రమాదాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో పాటు గ్రామాల్లో ప్రజలకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా అధికారుల ఆదేశాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను పలు సైబర్ నేరాలపై చైతన్య పరుస్తున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్‌ను ప్రజలు అభినందిస్తున్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా జవ్వాజి



ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైన జవ్వాజి సత్యనారాయణ

కురిచేడు: మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా జవ్వాజి సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం మండల ఆర్యవైశ్య సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికలకు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఎన్నికల నిర్వాహకులు మువ్వల శ్రీనివాసులు, యండమూరి రాములు వ్యవహరించారు. ఈ ఆలయ కమిటీ చైర్మన్ కొత్త వెంకట అయ్యపుశెట్టి, మేడం నాగేశ్వరరావు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

మానవతా విలువలు పాటించాలి

గిద్దలూరు రూరల్: మానవతా విలువలు పాటించడం ఉత్తమమైందని సత్యసాయిసేవా సమితి మండల కన్వీనర్ ఎస్.అనంతరామయ్య అన్నారు. విలువలతో కూడిన నడక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్, కుమ్మరాంకట్ట సెంటర్, పొట్టిశ్రీరాములు సెంటర్, వైఎస్సార్ సెంటర్‌లలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సత్యం ధర్మం శాంతి ప్రేమ అహింస వంటి మంచి మార్గాలను ప్రతి ఒక్కరూ అవలంబిస్తూ మానవతా విలువలు పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచి మంచి అలవాట్లను అలవర్చుకుని సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు కాశీవిశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొమరోలు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని దద్దవాడ గ్రామ సమీపంలో అమరావతి–అనంతపురం జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నుంచి ముగ్గురు వ్యక్తులు కారులో భద్రాచలం వెళ్తున్నారు. దద్దవాడ గ్రామసమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆటోను, పక్కగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి ఓ ఇంటి గోడను ఢీకొట్టింది. కారు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి, ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం, ఆటో ముందు భాగం దెబ్బతినగా, ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైంది.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మాట్లాడుతున్న అన్నా రాంబాబు, పక్కన షంషేర్ ఆలీబేగ్ తదితరులు

మార్కాపురం: ఈ ఏడాది ప్రజలు పడిన కష్టాలన్నీ తొలగిపోయి నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ ఆధ్వర్యంలో స్థానిక మొఘల్స్ గెస్టుహౌస్‌లో 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షంషేర్ ఆలీబేగ్ గత 20 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా కొనసాగించాలన్నారు. కొత్త సంవత్సరంలో ప్రజలకు అంతా మంచి జరగాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. సమాజంలో పాత్రికేయ వృత్తి పవిత్రమైన దని, ప్రజలకు ఉపయోగపడే మంచి వార్తలు అందించాలని విలేకర్లకు సూచించారు. షంషేర్ ఆలీబేగ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని చెప్పారు. నీతి నిజాయితీకి, మంచితనానికి అన్నా రాంబాబు నిలువుటద్దమని, ప్రజల కోసమే ఆయన పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, మండల కోఆప్షన్‌సభ్యులు మహమ్మద్ రఫీ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి భవనం రామచంద్రారెడ్డి, జాతీయ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, లయోలా చెంచిరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, తర్లుపాడు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు రామసుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ కోశాధికారి రామడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు



కళాశాల రోడ్డులో భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ

మార్కాపురం టౌన్: మార్కాపురం ప్రాంత ప్రజల గ్రామ ఇలవేలుపు పోలేరమ్మ తల్లిని ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. పోలేరమ్మను ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ బండ్లతో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య శిలలు, పుట్టలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

కాలేజీ రోడ్డులో...

కళాశాల రోడ్డులో వెలసిన అల్లూరి పోలేరమ్మ అమ్మవారికి అర్చకులు అమర్‌నాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మరింత విస్తృతంగా 'మానవత' సేవలు



ఫ్రీజర్ బాక్స్ వద్ద సంస్థ సభ్యులు

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు మరింత విస్తృతం చేయాలని కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. ఆదివారం స్థానిక దర్శి రోడ్డులోని నూతన కార్యాలయం భవన నిర్మాణ శ్లాబు పనులు చేపట్టారు. అనంతరం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంస్థ ఏర్పాటు చేసిన రోజు నుంచి అందించిన సేవలను, భవిష్యత్‌లో అందించాల్సిన సేవల గురించి సమావేశంలో చర్చించారు. సంస్థ అందిస్తున్న సేవలకు, భవన నిర్మాణానికి విరాళం అందించిన దాతలను పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మరింత సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చప్పిడి రామలింగయ్య సంస్థకు ఫ్రీజర్ బాక్సు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ మువ్వల పార్థసారథి, జిల్లా కార్యదర్శి కె.యల్లమందారెడ్డి, కోశాధికారి సోమిశెట్టి చిరంజీవి, అధ్యక్షుడు కల్లం సుబ్బారెడ్డి, శ్రావణి వెంకటేశ్వర్లు, యక్కలి శేషగిరిరావు, జీసీ సుబ్బారావు, సామంతపూడి నాగేశ్వరరావు, బండి అశోక్, కాసు వెంకటేశ్వరరెడ్డి, పేర్ల శ్రీనివాసరావు, వరికూటి శిరీష, కరీముల్లా బేగ్, షేక్ నూర్జహాన్ బేగం, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్ కంఠస్థ పోటీ విజేతలకు బహుమతులు



బహుమతులు అందిస్తున్న షంషేర్ ఆలీబేగ్

మార్కాపురం రూరల్: యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్, జమాతే ఇస్లామీ హింద్ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రవ్యాప్త పదో ఖురాన్ కంఠస్థ పోటీల్లో విజేతలకు ఆదివారం స్థానిక చిన్నమసీదు ఆవరణలో బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్ మాట్లాడుతూ.. ఖురాన్ సూక్తులను పాటిస్తూ ఆధ్యాత్మిక విలువలను అలవర్చుకోవాలన్నారు. తోటివారికి సాయం చేయడం, ప్రేమ దయ కలిగి ఉండాలన్నారు. నైతిక విలువల పరిరక్షణకు సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. గొప్ప ధార్మిక సమాజం ఏర్పాటుకు ఖురాన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఏఈ మహబూబ్‌బాషా, సలహా మండలి సభ్యులు అష్రఫ్ ఆలీ, జహీర్ రాజ్, హఫీజ్, అయూబ్, అబ్దుల్ రెహమాన్, ఖాశీం, షాహిద్, సికిందర్‌బాషా, అరాఫత్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు లక్ష్మీ నరసయ్య మృతి



లక్ష్మీ నరసయ్య (ఫైల్)



లక్ష్మీ నరసయ్యకు నివాళులర్పిస్తున్న అందె నాసరయ్య

కొనకనమిట్ల: మండల సీపీఐ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పిల్లి లక్ష్మీ నరసయ్య (75) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. లక్ష్మీ నరసయ్య గతంలో సీపీఐ తరఫున కొనకనమిట్ల ప్రాదేశిక సభ్యులుగా ఎన్నికయ్యారు. తన పదవీ కాలంలో గ్రామ పంచాయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పలువురు కొనియాడారు. ఆదివారం మార్కాపురం మున్సిపల్ మాజీ చైర్మన్, నియోజకవర్గ సీపీఐ నాయకులు అందె నాసరయ్య, జీపీ రామారావు, డీహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ లక్ష్మీనరసయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో పొదిలి ఏరియా సీపీఐ కార్యదర్శి వెంకటరత్నం, సీపీఎం నాయకులు రమేష్, పెద్ద సిద్దయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి దాసరి గురుస్వామి, వినియోగదారుల రక్షణ సమితి అధ్యక్షులు, న్యాయవాది దర్నాసి రామారావు, ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు మంచికల కోటేశ్వరరావు, టి.రామారావు, స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి ఎస్వీ.బాలయ్య, కుంచేపల్లి పశువైద్యాధికారి మణిశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఎం.చినకోటేశ్వరరావు, వరికూటి రమణారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, మండల పాత్రికేయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి టీచర్లు కృషి చేయాలి

మార్కాపురం టౌన్: విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. ఆదివారం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభను జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. యూటీఎఫ్ వ్యవస్థాపకులు దాచూరి రామిరెడ్డి పేరుతో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు. ఇటీవల రిటైరైన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓ రాందాస్‌నాయక్, యూటీఎఫ్ అధ్యక్షుడు అబ్దుల్ హై, జిల్లా కార్యదర్శి శ్రీరాములు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ చలమయ్య, కుటుంబ సంక్షేమ పథకం కన్వీనర్ పాపయ్య, కాశిరెడ్డి, మార్కాపురం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయరామిరెడ్డి, రాజేష్, మార్కాపురం పట్టణఅధ్యక్ష కార్యదర్శులు కృష్ణమూర్తి, శ్రీనివాసమూర్తి, తర్లుపాడు నాయకులు చంద్రశేఖరయ్య, డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి

మార్కాపురం: జనవరి 5వ తేదీన విజయవాడ గన్నవరం విమానాశ్రయ సమీపంలోని కేసరపల్లిలో నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని హిందూ సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో శంఖారావ కార్యక్రమానికి మద్దతుగా హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాలు బైక్ ర్యాలీ నిర్వహించారు. తర్లుపాడు రోడ్డులోని ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి ప్రారంభమై పట్టణ పురవీధుల్లో తిరిగి చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద ర్యాలీ ముగిసింది. దేవాలయాలపై, హిందూధర్మంపై జరుగుతున్న దాడులను నాయకులు ఖండించారు. విజయవాడలో నిర్వహించే కార్యక్రమానికి మార్కాపురం ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులైన వెంకటేశ్వరరెడ్డి, రంగస్వామిగౌడ్, సాయిసుబ్బారావు, లక్ష్మణ్, వీరారావు, అంజిరెడ్డి, చరణ్, గుంటక సుబ్బారెడ్డి, పీవీ కృష్ణారావు, దేవిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాభవానికి పూజలు



ప్రత్యేక అలంకరణలో గుంటిగంగ అమ్మవారు

తాళ్లూరు: మండలంలో గంగవరం పంచాయతీ సోమవరప్పాడు గ్రామం పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రంలో వేంచేసిన గంగాభవాని అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయలక్ష్మి, బాలరాజు, కామేశ్వరశర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు ఆలయానికి చేరుకుని ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలోని మల్లికార్జున స్వామి, నాగమ్మతల్లి విగ్రహాలను పూజించారు. ఆలయ చైర్మన్ కె. గురుబ్రహ్మం, ఈఓ గుంటపల్లి వాసు పర్యవేక్షించారు.

ఆలయాల్లో పోటెత్తిన భక్తులు



అలంకరణలో వేనూతల కాటమరాజుస్వామి

పెద్దారవీడు: మండలంలో పరిధిలో గుండంచర్ల పంచాయతీ నల్లమల అడవిలో వెలసిన గంగాభవానీ శ్రీ వేనూతల కాటమ రాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన శ్రీ అంకాళమ్మ దేవత, ఎస్. కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. కాటమరాజు స్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. కాయకర్పూరం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

- డీఎస్పీ నాగరాజు

మార్కాపురం: బైక్ ప్రమాదాలు సంభవించిన సమయంలో హెల్మెట్ ఉంటే ప్రాణాలకు రక్షణ పొందవచ్చని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని డీఎస్పీ నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో పోలీసు సిబ్బంది, పాత్రికేయులకు హెల్మెట్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టూ వీలర్‌పై వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇకపై రోజూ పోలీస్ సిబ్బంది హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ.. హెల్మెట్ లేనివారికి తప్పనిసరిగా జరిమానా విధిస్తారని చెప్పారు. సీఐ సుబ్బారావు మాట్లాడుతూ.. హైకోర్టు సూచనల ప్రకారం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు డాక్టర్ రాజమోహన్, సైదుబాబు, అహరోన్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మాచర్ల కోర్టులో

ఒ.ఎస్.నెం : 11/2021.

మాచిక్కపల్లి బాను ... వాది

మరియు

ముదికపూడి ఏసోబు ... ప్రతివాది

ప్రతివాది : ముదికపూడి ఏసోబు తండ్రి దేవదానం, హిందూ, వయస్సు 47సం॥లు [illegible] ప్రకాశం జిల్లా.

[illegible] తేది. 7-1-2025 నాటికి శ్రీ కోర్టువారు [illegible] ఉదయం 10.30 గంటలకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరై [illegible] తెలుప కోనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

ఇవ్వబడిన తేది . 07 01 2025

కొత్తపల్లి డేవిడ్ రాజు, న్యాయవాది. రిజిష్టర్ నెం–ఏ.పి. 1410/1987 మాచర్ల 522426. సెల్ : 9885788218

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మార్కాపురం డివిజన్

99516 02963 (మార్కాపురం)

99122 25435 (గిద్దలూరు)

Office mail : sakshiongads@gmail.com